క్లుప్తంగా

విశ్వేశ్వర స్వామికి అన్నాభిషేకం


కోరివారి అగ్రహారంలో విశ్వేశ్వర స్వామికి అన్నాభిషేకం చేసిన భక్తులు

అంబాజీపేట: కార్తికమాసాన్ని పురస్కరించుకుని మాచవరం కోరివారి అగ్రహారంలో వేంచేసిన భువనేశ్వరి సమేత విశ్వేశ్వర స్వామి వారికి శుక్రవారం అన్నాభిషేకం నిర్వహించారు. దూళిపాల ప్రవీణ్‌కుమార్ శర్మ, గన్నవరపు బదిరిల పర్యవేక్షణలో గ్రామస్తుల సహకారంతో స్వామికి 70 కేజీల అన్నాభిషేకాన్ని చేపట్టారు. అంతకుముందు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపించారు. అన్నాభిషేకం చేయడం వల్ల అన్యోన్య సహకారంతో లోకం సుభిక్షంగా ఉంటూ, పాడిపంటల సమృద్ధి కలగాలని గ్రామస్తుల కోరారు. అలాగే మాచవరంలో కందుల మల్లేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామి వారికి లక్ష బిల్వార్చన, ప్రత్యేక పూజలు చేశారు. మండలంలో ఉన్న ఏకాదశ రుద్రులను దర్శించుకునేందుకు ఖమ్మం జిల్లా నుంచి రెండు ఆర్టీసీ బస్సులలో యాత్రికులు తరలి వచ్చి స్వామి వార్లను దర్శించుకున్నారు.

నేడు లక్ష తమలపాకుల పూజ

మామిడికుదురు: గ్రామంలో కొలువుదీరిన అభయాంజనేయస్వామికి శనివారం లక్ష తమలపాకుల పూజ ఏర్పాటు చేశామని ఆలయ కమిటీ శుక్రవారం తెలిపింది. అభయాంజనేయస్వామికి హనుమాన్ చాలీసా పారాయణ సహిత లక్ష తమలపాకుల పూజ, సహస్ర దీపాలంకరణ సేవ ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 8 గంటలకు ఈ పూజ ప్రారంభమవుతుందని తెలిపారు. దీనిలో భాగంగా మధ్యాహ్నం శ్రీసీతారామకల్యాణం నిర్వహిస్తామని చెప్పారు. సాయంత్రం సహ్ర దీపాలంకరణ సేవ తదుపరి రాత్రి అన్న సంతర్పణ ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు.

నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ

అయినవిల్లి: మండలంలోని వీరవల్లిపాలెంలో సూర్యనారాయణమూర్తి సత్రం వ్యవస్థాపక ధర్మకర్త ముద్రగెడ నాగయ్య జయంతి సందర్భంగా శుక్రవారం నిరుపేదలు, వితంతువులు, వికలాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. సత్రం ట్రస్ట్ మెంబర్ ముద్రగెడ వెంకట సత్య సుబ్బారావు నాగయ్య కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేతుల మీదుగా దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముద్రగెడ సీతారామ వెంకట్రావు, ముద్రగెడ ప్రకాశరావు, ముద్రగెడ శ్రీనివాసరావు, ముద్రగెడ వెంకట శ్రీరామ నాగేంద్రప్రసాద్, సిబ్బంది ముద్రగెడ వెంకట సత్యనాగరాజు, ముద్రగెడ గణేష్ పాల్గొన్నారు.

సైబర్ నేరాల నివారణపై అవగాహన ఉండాలి

రాజోలు: సైబర్ నేరాలను నివారించేందుకు ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని రాజోలు సీఐ నరేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు అధ్యక్షన సోషల్ మీడియా, సైబర్ బుల్లియింగ్ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ సాయిబాబు, సీఐ నరేష్‌కుమార్‌లు మాట్లాడుతూ సైబర్ నేరాలతో అనేక మంది బ్యాంకుల్లో దాచుకున్న సొమ్ములను కోల్పోతున్నారన్నారు. అలాగే సోషల్ మీడియాలో అభ్యంతరకరమైన పోస్టులు పెడితే క్రిమినల్ కేసులు ఎదుర్కోవలసి వస్తుందన్నారు. ఎన్ఎస్ఎస్ పీఓ నల్లి రాజు, అధ్యాపకులు సరిత, శైలజ, డాక్టర్ దయాసాగర్ పాల్గొన్నారు.

కంటిచూపుపై అప్రమత్తంగా ఉండాలి

అంబాజీపేట: కంటికి సంబంధించిన వ్యాధులు, చూపుపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ ఆరు నెలలకోసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలని ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ బషీర్ అన్నారు. అంబాజీపేట మెట్లకాలనీలో లీజర్ రైట్ ఐ కేర్ డిపార్ట్‌మెంట్ వైద్య బృందం సహకారంతో కోనసీమ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 110 మందిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫిరోజ్, మహమ్మద్ మహబూబ్, షరీఫ్ పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ సమస్యలు పరిష్కరించాలి

మలికిపురం: భారత సంచార నిగమ్ లిమిటెడ్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా టెలికం ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ పలివెల రాజుని రాజమహేంద్రవరం సంచార భవన్‌లో శుక్రవారం లక్కవరం వర్తక సంఘం అధ్యక్షుడు రుద్రరాజు గోపాలకృష్ణంరాజు కలసి రాజోలు డివిజన్లో సెల్‌వన్ ఖాతాదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. 3 జీ నుంచి 4 జీకి మార్చినప్పటి నుంచి సిగ్నల్ సరిగా లేకపోవుట, కాల్ మాట్లాడేటప్పుడు కట్ అవడం, నెట్ మధ్యలో ఆగిపోవడం తదితర సమస్యలతో ఖాతాదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. 3 జీ నుంచి 4 జీకి మార్పు పనులు జరుగుతున్నందున వలన డిసెంబర్ నెలాఖరు వరకు కొన్ని ఇబ్బందులు ఉంటాయని జీఎం వివరించినట్లు రాజు తెలిపారు. ఇతర నెట్‌వర్కుల కన్నా రేట్ల విషయంలో సెల్‌వన్ రేట్లు చాలా తక్కువ ఉండటం వలన ఇతర నెట్‌వర్కుల వారు సెల్‌వన్ వైపు చూస్తున్నారని, నెట్‌వర్క్ బావుంటే సెల్ వన్ వైపు మారటానికి సిద్ధంగా ఉన్నారని గోపాలకృష్ణంరాజు చెప్పడంతో ఈ విషయంపై జీఎం సానుకూలంగా స్పందించి ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారని ఆయన అన్నారు.

సంక్షేమ హాస్టళ్లలో వసతుల లేమి

- భవనాల శ్లాబులకు లీకులు
- చెదపట్టిన తలుపులు, కిటికీలు
- సరిపడా లేని మరుగుదొడ్లు
- విడుదల కాని మెస్, కాస్మొటిక్ చార్జీలు


నిర్మాణ దశలో నిలిచిపోయిన కొత్తపేట బాలుర హాస్టల్ మరుగుదొడ్లు


చెదలుపట్టి ఊడిపోతున్న కొత్తపేట బాలికల హాస్టల్ కిటికీ తలుపు

కొత్తపేట/రావులపాలెం: సాంఘిక సంక్షేమ హాస్టళ్ల అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. పలు భవనాల లీకులు, విద్యార్థులకు సరిపడా లేని టాయ్‌లెట్స్, చెదలు పట్టి ఊడిపోతున్న తలుపులు, కిటికీలు, పనిచేయని ఫ్యాన్లు, వెలగని లైట్లు వంటి వసతుల లేమితో వివిధ హాస్టళ్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గ కేంద్రం కొత్తపేటలో సాంఘిక సంక్షేమ బాలురు, బాలికల వసతి గృహాలున్నాయి. బాలికల వసతి గృహంలో 105 మంది బాలికలు ఉన్నారు. ఈ హాస్టల్ భవనం కిచెన్, డైనింగ్ హాల్స్‌లో వర్షం నీరు లీకవుతుంది. తలుపులు, కిటికీలు చెదలు పట్టి ఊడిపోతున్నాయి. దోమల మెస్‌లు ఊడిపోయి లోనికి దోమలు ప్రవేశిస్తున్నాయి. పూర్వం నాటి ఫ్యాన్లు తిరగడం లేదు, లైట్లు వెలగడం లేదు. మెస్ చార్జీలు, ఈ ఏడాది మే నెల వరకు వరకూ విడుదల కాగా జూన్ నెల నుంచి 5 నెలలకు చెల్లించవలసి ఉంది. కాస్మొటిక్ చార్జీలు జనవరి నుంచి చెల్లించవలసి ఉంది. ఇదీ ఈ హాస్టల్ పరిస్థితి. మరో సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో 153 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ డైనింగ్ హాలును స్టడీ హాలు, అదనపు వసతికి ఉపయోగించడం వలన డైనింగ్ హాలు సౌకర్యం లేదు. ఇక్కడ విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు లేక గత ప్రభుత్వంలో 6 బాత్ రూములు, 6 మరుగుదొడ్లు నిర్మాణం చేపట్టారు. అవి నిర్మాణ దశంలో ఉండగా ఈ కూటమి ప్రభుత్వంలో నిర్మాణం నిలిచిపోయింది. రావులపాలెంలో సాంఘిక సంక్షేమ హాస్టళ్లు 1, 2 ఉన్నాయి. జెడ్పీ బాలికోన్నత పాఠశాల పక్కన ఒకే ఒక బిల్డింగులో రెండు హాస్టళ్లు నిర్వహిస్తున్నారు. రెండంతస్తుల భవనంలో పై అంతస్తులో హాస్టల్ వన్, కింది అంతస్తులో హాస్టల్ టు నిర్వహిస్తున్నారు. ప్రతి అంతస్తులో ఏడు రూములు ఉన్న ఈ భవనంలో 160 మందికి అనుమతి ఉన్నా వసతుల లేమి కారణంగా ప్రస్తుతం 120 మంది మాత్రమే ఉంటున్నారు. వీరిలో జ్వరాలు, ఇతర కారణాల వల్ల పది మంది పిల్లలు వెళ్లిపోగా, ప్రస్తుతం 110 మంది మాత్రమే ఉన్నారు. అయితే ఇక్కడ మరుగుదొడ్లు, స్నానాల గదుల కొరత తీవ్రంగా ఉంది. పదిమందికి ఒక టాయిలెట్, ఒక బాత్రూమ్ ఉండాలన్న నిబంధన ఉన్న ఇక్కడ అవేవీ కానరావడం లేదు. మొత్తంగా 10 టాయిలెట్స్, పది బాత్రూములు ఉండగా టాయిలెట్ నిర్వహణ అంతంతమాత్రంగా ఉన్నాయి. ఇక బాత్రూమ్స్ అయితే ఐదు బాత్రూములు శిథిలావస్థకు చేరడంతో నిరుపయోగంగా ఉన్నాయి. పై అంతస్తులో మూడు రూములు స్లాబ్ లీక్ కావడం వల్ల గదుల్లో వర్షం కురుస్తుంది. ఇక కిచెన్ రూమ్ అయితే స్లాబ్ లీకులతో పూర్తిగా అధ్వానంగా ఉంది. ఇక్కడ తాగునీరు కోసం ఉన్న ఆర్వో ప్లాంట్ పూర్తిగా పాడైపోయింది. దీంతో సురక్షిత నీరు సౌకర్యం లేదు. అదేవిధంగా హాస్టల్‌కి వెళ్లే దారి సరైన రోడ్డు లేకుండా విద్యార్థులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దారి ప్రారంభంలో మలమూత్రాలు విసర్జన చేయడంతో దుర్వాసన వెదజల్లుతుంది. తుప్పలు మొక్కలు మొలిచి దారి చాలా ఘోరంగా ఉంది. అలాగే హాస్టల్ నుంచి బయటికి పోయే మురికి నీరు పోవడానికి డ్రైనేజీ లేక కచ్చా డ్రైన్ నిర్వహణతో దుర్వాసన వెదజల్లుతూ ఆ ప్రాంతం అపరిశుభ్రంగా మారింది. ఆలమూరులో సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో గతంలో 180 మంది విద్యార్థులు వసతి పొందేవారు. అయితే తగిన సౌకర్యాలు లేక విద్యార్థులు బయటకు వెళ్లిపోయారు. ప్రస్తుతం 48 మంది మాత్రమే ఉన్నారు.

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి

రెక్కాడితే గాని డొక్కాడని పేద, నిరుపేద కుటుంబాల్లో పిల్లలు చదువుకునే సంక్షేమ వసతి గృహాలు సమస్యల నిలయాలుగా మారాయి. వర్షాలు కురిస్తే భవనాల శ్లాబులు లీకవడం, వర్షం నీరు నిలిచిపోవడం, పాత భవనాలు కావడంతో గుమ్మాలు, కిటికీలు, వాటి డోర్లు ఊడిపోతుండటం వంటి కారణాలతో గదుల్లో దోమల బెడద ఎక్కువైపోయింది. తగినన్ని బాత్‌రూములు, మరుగుదొడ్లు లేకపోవడంతో పిల్లలకు ముఖ్యంగా బాలికలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పై సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. మెస్, కాస్మొటిక్ చార్జీలు విడుదల చేయాలి.
– ఎస్.ఆదిత్యకిరణ్, అధ్యక్షుడు, వినియోగదారులు సంఘం, కొత్తపేట

మాజీ సీఎం జగన్‌ను కలసిన శ్రీనివాస్


జగన్‌మోహన్‌రెడ్డికి వివాహ ఆహ్వానపత్రిక అందిస్తున్న శ్రీనివాస్

అంబాజీపేట: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు చెల్లుబోయిన శ్రీనివాసరావు, పేరి శ్రీనివాస్‌లు శుక్రవారం తాడేపల్లిలో క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పేరి శ్రీనివాస్ కుమారుడిది వచ్చే నెల 4న వివాహం సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డికి వివాహ ఆహ్వాన పత్రికను అందజేసి ఆహ్వానించారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం


అగ్నిప్రమాద బాధితులకు సాయం అందజేస్తున్న తహసీల్దార్ నాగలక్ష్మమ్మ

అయినవిల్లి: చింతనలంకలో అగ్నిప్రమాదం సంభవించి సర్వం కోల్పోయిన బాధితులకు రెడ్ క్రాస్ సొసైటీ నుంచి స్థానిక తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. బాధితులకు బియ్యం, నిత్యావసరాలు, కట్టుకోవడానికి దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఎంపీటీసీలు, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పాటు పడాలి



పి.గన్నవరం సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఐవీ

పి.గన్నవరం: ఉపాధ్యాయులు ఐక్యంగా ఉండి సమస్యల పరిష్కారానికి పాటుపడాలని ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. యూటీఎఫ్ పి.గన్నవరం మండల శాఖ స్వర్ణోత్సవ వేడుకలు స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం రాత్రి ఘనంగా జరిగాయి. మండల శాఖ అధ్యక్షుడు దూనబోయిన రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో ఐవీ మాట్లాడుతూ విద్యాభివృద్ధే లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలని సూచించారు. ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులను మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమాల్లో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు పి.వెంకటేశ్వరరావు, కార్యదర్శి వి.రత్నం, మండల ప్రధాన కార్యదర్శి గిడ్ల శ్రీనివాస్, జీఎస్ పద్మావతి, డీఎస్‌వీ ప్రసాద్, జి.కనకదుర్గ, ఎం.మహాలక్ష్మి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కళ్లాల్లోనే ధాన్యం రాశులు


చింతలూరులో బరకాలు కప్పుకుని ధాన్యాన్ని సంరక్షించుకుంటున్న రైతులు


కొత్తపేటలో కళ్లాల్లో ఆరబెట్టుకున్న ధాన్యం బరకాలతో కప్పుకుంటున్న రైతులు

ఆలమూరు: నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుపాను ప్రభావంతో ధాన్యపు రాశులు కళ్లాల్లోనే ఉండిపోయాయి. గత వారం రోజుల నుంచి తుపాను ప్రభావంతో ఆకాశం మేఘావృతం కావడంతో ఆరబెట్టిన ధాన్యంలో తేమ శాతం ఇంకా తగ్గలేదు. రైసుమిల్లర్లు తమ ధాన్యానికి తేమశాతం బూచిగా చూపి ధరలు తగ్గిస్తారేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఒక మోస్తరు వర్షాలు కురవడంతో కళ్లాల్లోనే ధాన్యపు రాశులు ఉండిపోయాయి. మండలంలో సుమారు 11 వేల ఎకరాల్లో వరిసాగు చేయగా ఇప్పటి వరకూ సుమారు తొమ్మిది వేల ఎకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయి. ఇప్పటికే ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన దాదాపు 18 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైసుమిల్లులకు సరఫరా చేయగా కళ్లాల మీద ఇంకా నాలుగు వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉందని మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీలావణ్య మంగళవారం తెలిపారు. రైతులందరూ తమ ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకుని వాతావరణ పరిస్థితుల నుంచి రక్షించుకోవాలని ఆమె సూచించారు.

అకాల వర్షానికి తడిసిన ధాన్యం

అయినవిల్లి: తుపాను కారణంగా శుక్రవారం కురిసిన అకాల వర్షంకు మండలంలోని అయినవిల్లి, నేదునూరు, విలస, సిరిపల్లి, కె.జగన్నాథపురం, మాగాం, వెలువలపల్లి, నల్లచెరువు, ఎన్.పెదపాలెం గ్రామాల్లో ధాన్యం తడిచి ముద్దయింది. రైతులు యంత్రాల సాయంతో వరి కోతలు కోసి రోడ్ల పైన, కళ్లాల్లోను ధాన్యం అరబెట్టారు. అకాల వర్షంతో ఎక్కడి ధాన్యం అక్కడే తడిచి పాడయింది. ఉరుకులు పరుగులతో ధాన్యం తడవకుండా ఒబ్బిడి చేసేందుకు శతవిధాలా ప్రయత్నం చేసినా వర్షం వచ్చి తమ పంటను తడిపిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

అన్నదాతల ఆందోళన

పి.గన్నవరం: తుపాను ప్రభావంతో శుక్రవారం మండలంలో చిరుజల్లులు పడటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చేతికి వచ్చిన పంటను కాపాడుకోవడానికి రైతులు ప్రయత్నిస్తున్నారు. మండలంలో 6100 ఎకరాల్లో వరి పంట వేశారు. ఇంతవరకూ సుమారు 2100 ఎకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయి. ఇంకా 4000 ఎకరాల్లో కోత కోయాల్సి ఉంది.

అన్నదాతకు వరుణ గండం

కొత్తపేట: గత మూడు రోజులుగా బంగాళాఖాతంలో వాయుగుండం కారణంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తం కావాలని రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు సూచిస్తున్నప్పటికీ తుపాను ప్రభావం మన ప్రాంతానికి పెద్దగా ఉండదని రైతులు ధీమాగా ఉన్నారు. అయితే రైతులు ధీమాకు అనుగుణంగానే గత రెండు రోజులు వాతావరణంలో ఏ విధమైన మార్పులు లేవు. కానీ వాతావరణ శాఖ హెచ్చరికలకు అనుగుణంగా శుక్రవారం మధ్యాహ్నం వాతావరణం మారి వర్షం ప్రారంభమవడంతో రైతులు ఉరుకులు పరుగులు పెట్టారు. కళ్లాల్లో ధాన్యాన్ని బరకాలతో కప్పుకున్నారు.

గోగన్నమఠంలో క్షత్రియుల సంబరాలు


గోగన్నమఠంలో కేక్ కట్ చేస్తున్న క్షత్రియులు

మామిడికుదురు: ముంబయి ఇండియన్స్ జట్టుకు పీవీ సత్యనారాయణరాజు ఎంపికైన నేపథ్యంలో శుక్రవారం అతడి స్వగ్రామం గోగన్నమఠంలో సంబరాలు నిర్వహించారు. గ్రామ క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణరాజు ఫ్లెక్సీలను గ్రామంలో భారీగా ఏర్పాటు చేశారు. వేంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో సత్యనారాయణరాజు భారీ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అక్కడ కేక్ కట్ చేసి సత్యనారాయణరాజు ముంబయి ఇండియన్స్ తరఫున అత్యుత్తమ ప్రతిభ చూపి అంతర్జాతీయ క్రికెట్ పోటీలకు ఎంపిక కావాలని అభిలషించారు. ముంబయి జట్టుకు ఆల్ ద బెస్ట్ అంటూ విషెష్ తెలిపారు. అనంతరం ఉసిరిచెట్టు వద్ద ప్రత్యేక పూజలు చేసి కార్తిక వన సమారాధనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భూపతిరాజు ఈశ్వరరాజు వర్మ, భూపతిరాజు సత్తిబాబురాజు, సాగి పీఆర్‌వీఎస్ఎస్ నర్సింహవర్మ పాల్గొన్నారు.

క్రమశిక్షణ గల కార్యకర్తలు జగన్‌కే సొంతం

మాజీమంత్రి గొల్లపల్లి


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: క్రమశిక్షణ గల కార్యకర్తలు జగన్ సారథ్యంలోని వైఎస్సార్ సీపీకే సాధ్యమని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. శుక్రవారం మలికిపురం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో రాజోలు మండలం 16 గ్రామశాఖల అధ్యక్షులతో సమావేశం రాజోలు మండల అధ్యక్షుడు కట్టా శ్రీనివాస్‌రావు అధ్యక్షతన జరిగింది. మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఎన్ని ఒడిదొడుకులు వచ్చినా తట్టుకుని నిలబడిన వైఎస్సార్ సీపీకి క్రమశిక్షణ కలిగిన కార్యకర్తలు ఉన్నారని రాష్ట్రంలో అన్ని వర్గాల వారికీ లబ్ధి చేకూర్చిన పార్టీ ఇదేన్నారు. అధికారంలో ఉన్నంత కాలం వైఎస్సార్ సీపీ అంబేడ్కర్ రాజ్యాంగ విలువలకు కట్టుబడి పరిపాలన కొనసాగిందని, ఇప్పటి ప్రభుత్వం రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కి నీతి నియమాలు లేకుండా, కేవలం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని గొల్లపల్లి అన్నారు. ప్రతీ గ్రామంలో వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ కమిటీలు పటిష్టంగా ఉండాలని అప్పుడే పార్టీ బలంగా ఉంటుందని తద్వారా అధికార పార్టీ చేసే దురాగతాలను అరికట్టవచ్చని ప్రజలకు న్యాయం జరిగేలా కృషి చేయవచ్చని మాజీమంత్రి గొల్లపల్లి అన్నారు. మాజీ నెడ్ క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్, కంచర్ల శేఖర్, కుసుమ చంద్రశేఖర్, గుబ్బల మనోహర్, ఉచ్చుల దాసు, అడబాల జానకిరామ్, ఈద రవిరెడ్డి, ఎస్తేరు రాణి, పెదపాటి నాగలక్ష్మి, లత, అన్ని గ్రామ శాఖల అధ్యక్షులు పాల్గొన్నారు.

'పొన్నాడ' జ్ఞాపకార్థం సమావేశ హాలు నిర్మాణం


బార్ అసోసియేషన్ పైఅంతస్తు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న సీనియర్ న్యాయవాది పాపయ్యపంతులు

రాజోలు: సీనియర్ న్యాయవాది పొన్నాడ హనుమంతరావు జ్ఞాపకార్థం ఆయన కుటుంబీకులు రాజోలు బార్ అసోసియేషన్ భవనంపై సమావేశ హాలు నిర్మాణం చేయడంపై న్యాయవాదులు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. 60 ఏళ్ల న్యాయవాద వృత్తిలో కొనసాగిన హనుమంతరావు అనేక న్యాయ సంబంధమైన పుస్తకాలను రచించారన్నారు. బార్ అసోసియేషన్ భవనం పైఅంతస్తు నిర్మాణం చేసేందుకు హనుమంతరావు కుమారుడు పొన్నాడ సూర్యప్రకాష్ ముందుకు వచ్చారు. దీంతో భవనం నిర్మించేందుకు సీనియర్ న్యాయవాది వాడ్రేవు పాపయ్యపంతులు కొబ్బరికాయ కొట్టి పనులకు శ్రీకారం చుట్టారు. పొన్నాడ హనుమంతరావు సర్పంచ్‌గా రాజోలు గ్రామానికి అనేక సేవలు అందించారన్నారు. రాజోలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మామిడిశెట్టి సాయిబాబు, ప్రధాన కార్యదర్శి గొల్లమండల స్టాలిన్, ఉపాధ్యక్షుడు చింతా ప్రసాద్, సీనియర్ న్యాయవాదులు పొన్నాడ సూర్యారావు, మైలవరపు రవిరామ్, ఆకుల భాస్కరరావు, బెల్లంకొండ సూరిబాబు, ఎడ్విన్‌మైఖేల్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు క్రమం తప్పకుండా రావాలి

అంబాజీపేట: ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచి పాఠశాలకు క్రమం తప్పకుండా వెళితే మంచి భవిష్యత్తు ఉంటుందని సర్పంచ్ తరపట్ల మోహన్‌సింగ్ బాబూరావు అన్నారు. ఎస్పీ మోకా సత్తిబాబు సమకూర్చిన నోట్స్, బుక్స్, స్టేషనరీని ఇసుకపూడి చెరువు గట్టు వద్ద ఉన్న ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.ముసలయ్య అధ్యక్షతన విద్యార్థులకు శుక్రవారం పంపిణీ చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ దాతలు ఇస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుని శ్రద్ధగా చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో రొక్కాల బాలకృష్ణ, గిడ్డి కిరణ్, తరపట్ల రాంబాబు, పంచాయతీ సిబ్బంది నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరబెట్టిన ధాన్యం మిల్లులకు తరలించాలి


గంగలకుర్రులో ధాన్యంను రైస్ మిల్లుకు తరలించాలని రైతుకు వివరిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వరి

అంబాజీపేట: ఆరుబయట ఆరబెట్టిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు గాని, రైస్ మిల్లులకు తరలించాలని తహసీల్దార్ జె.వెంకటేశ్వరి అన్నారు. గంగలకుర్రులో రహదారి పక్కన ఆరబెట్టిన ధాన్యం రాశులను మండల వ్యవసాయాధికారి సీహెచ్ విజయకుమార్‌తో కలసి శుక్రవారం ఆమె పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ తుపాను ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వరి కోతలను తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలని రైతులకు సూచించారు. రైతు సేవా కేంద్ర సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటారని వారిని సంప్రదించి ధాన్యం పాడవకుండా మిల్లులకు తరలించాలన్నారు. అనంతరం ముక్కామలలో ఉన్న ధాన్యం మిల్లును తహసీల్దార్ పరిశీలించారు. రైస్ మిల్లు వద్ద వాహనాల్లో ఉన్న ధాన్యం బస్తాలను త్వరితగతిన తొలగించాలన్నారు. వాహనాలపై ఉన్న ధాన్యం లోడ్‌ను త్వరగా అన్‌లోడ్ చేయాలని సిబ్బందికి సూచించారు. రైస్ మిల్లు వద్ద కస్టోడియన్ అధికారి 24 గంటలు అందుబాటులో ఉంటారని వారి సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వన్ యం వన్ బి గ్రీన్ క్లబ్ ప్రారంభం


గ్రీన్ క్లబ్ ప్రారంభోత్సవంలో ప్రాజెక్టు ఇన్‌చార్జి సాగర్‌తో విద్యార్థులు

మలికిపురం: మండలంలోని విశ్వేశ్వరాయపురం ఉన్నత పాఠశాల, 1 ఎం 1 బీ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం పాఠశాల ఆవరణలో గ్రీన్ క్లబ్ ప్రారంభించారు. సమావేశంలో 1 ఎం 1 బీ బీ స్టేట్ ఇంచార్జ్ సాగర్ మాట్లాడుతూ ఒక మిలియన్ విద్యార్థులను స్కిల్ డెవలపర్లుగా తయారు చేస్తే వారి నుంచి ఒక బిలియన్ ప్రజలకి మేలు చేరుతుందని సంస్థ ఉద్దేశమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న విద్యార్థుల్లో ఫ్యూచర్ స్కిల్ డెవలప్‌మెంట్, పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధి, ఈ–వేస్ట్ రీ సైక్లింగ్ వంటి అంశాలపై అవగాహన కల్పించేందుకు 1 ఎం 1 బీ సంస్థ పనిచేస్తుందని అన్నారు. దీనిలో భాగంగా విశ్వేశ్వరాయపురం ఉన్నత పాఠశాలతో 1 ఎం 1 బీ ఎంవోయూ చేసుకుని పనిచేస్తుందని తెలిపారు. ఈ గ్రీన్ క్లబ్ ద్వారా విద్యార్థులు ఖాళీ సమయాల్లో ఈ వేస్ట్‌ను సేకరించి, సేకరించిన ఈ వేస్ట్ ద్వారా కొన్ని ఉపయోగకర ప్రాజెక్టులు రూపొందించనున్నట్లు సాగర్ తెలిపారు. ఇప్పటికే ఈ వేస్ట్ ద్వారా రూపొందించిన ప్రాజెక్ట్ నమూనాను విద్యార్థినులు పీబీ సాధిక, ఎస్.రోజలిన్‌లు తోటి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎలెక్ట్రోప్రా సీఈఓ వెంకట్, పాఠశాల కరెస్పాండంట్ పీవీవీ వరప్రసాద్, ఉపాధ్యాయులు శ్యాంప్రసాద్, లక్ష్మి, సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష బిల్వార్చనలు

మామిడికుదురు: కార్తికమాసం శుక్రవారం కావడంతో అప్పనపల్లి అన్నపూర్ణా విశ్వేశ్వరస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా ఆలయ అర్చకుడు దొంతుకుర్తి వెంకటసత్యనారాయణశర్మ ఆధ్వర్యంలో భాగవతుల సత్యనారాయణమూర్తి బ్రహ్మత్వంలో విఘ్నేశ్వరపూజ, విశ్వేశ్వరస్వామికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అన్నపూర్ణమ్మకి లక్ష కుంకుమార్చన జరిపించారు. లక్షమారేడు దళాలతో అర్చన చేశారు. పలువురు భక్త దంపతులు లక్ష బిల్వార్చనల్లో కర్తలుగా పాల్గొన్నారు.

సఖినేటిపల్లి: అంతర్వేదిపాలెం గ్రామంలో కొలువైన పార్వతీ హాటకేశ్వరస్వామివారి ఆలయంలో శుక్రవారం అర్చకులు స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, అమ్మవారికి సహస్రనామ కుంకుమ పూజలు నిర్వహించారు. స్థానిక బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో మంగళంపల్లి బులిబాబు పర్యవేక్షణలో ఆలయ అర్చకులు తొలుత విఘ్నేశ్వరపూజ చేశారు. అనంతరం స్వామికి అర్చకులపై విశేష పూజలు శాస్త్రోక్తంగా చేశారు. పూజలు అనంతరం అర్చకులు ప్రసాద వితరణ చేశారు. పలువురు భక్తులు పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ

మామిడికుదురు: పట్టపగలు ఇంట్లో ఉన్న వృద్ధురాలిని పిలిచి ఆమె మెడలో బంగారు గొలుసు దొంగతనం చేసి పరారైన సంఘటన శుక్రవారం మామిడికుదురులో జరిగింది. మామిడికుదురు రెండో రోడ్డు సందులోని పెర్ల కాలువ గట్టు రామాలయం సమీపంలోని అడబాల శేషకుమారి ఇంటికి గుర్తు తెలియని వ్యక్తి వచ్చి ఆమెను పిలిచాడు. ఆమె బయటకు వచ్చి మాట్లాడుతుండగా ఆమె మెడలోని ఆరు కాసుల బంగారు గొలుసు లాక్కున్నాడు. దీంతో శేషకుమారి బిగ్గరగా కేకలు వేయడంతో ఆమెను కిందికి తోసేసి ఇంటి వెనక వైపు గోడ దూకి గొలుసు దొంగతనం చేసి దొంగ పరారయ్యాడు. దొంగతో పెనుగులాటలో అతనికి చెందిన సెల్‌ఫోన్ కింద పడిపోయింది. నగరం ఎస్సై ఎ.చైతన్యకుమార్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. దొంగతనానికి పాల్పడిన ప్రాంతం నుంచి సెల్‌ఫోన్‌ను, సమీపాన కొబ్బరి తోటలో దొరికిన టోపీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్థానికులు, సమీపంలోని సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా రెండు రోజుల నుంచి ఇద్దరు యువకులు ఈ ప్రాంతంలో చేపల కోసం గేలం వేస్తున్నట్లు నటిస్తూ సమయం చూసుకుని ఈ చోరీకి పాల్పడ్డారని భావిస్తున్నారు. ఈ దిశగా పోలీసులు విచారణ చేపట్టారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

పి.గన్నవరం: మండలంలోని కె.ఏనుగుపల్లిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు కొత్తపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని తెలిపారు. అతని నుంచి 22 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు ఆమె వివరించారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై కె.అన్నవరం, సిబ్బంది పాల్గొన్నారు.

సారా విక్రయిస్తున్న ఇద్దరిని..

కొత్తపేట: సారా విక్రయిస్తున్న ముగ్గురిని పట్టుకుని కేసు నమోదు చేసినట్టు ఎక్సైజ్ సీఐ కె కాత్యాయని శుక్రవారం తెలిపారు. ఆత్రేయపురం మండలం వెలిచేరు గ్రామానికి చెందిన నిచ్చెనకోళ్ల నాగరాజు సారా విక్రయిస్తున్నట్టు అందిన సమాచారంతో దాడి చేసి పట్టుకుని 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్న మన్నారు. అలాగే రావులపాలెం మండలం గోపాలపురంలో 12 మద్యం సీసాలు ఏసుబాబు వద్ద నుంచి స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశామన్నారు. అలాగే ముద్దాయిలను కోర్టుకు తరలించామన్నారు. ఈ దాడుల్లో ఎస్సై కె.అన్నవరం, సిబ్బంది పాల్గొన్నారన్నారు.